క్లుప్తంగా

సముచిత స్థానం కల్పిస్తా..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర విషయాల్లో స్థానిక టీడీపీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం వైరా టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ నాయకులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితా ఇతర సంక్షేమ పథకాల్లో టీడీపీ నాయకులు సూచించిన నిరుపేదలకు తప్పక వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. తన గెలుపుకు కృషి చేసిన స్థానిక టీడీపీ కార్యకర్తలను మరిచి పోనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహించాలి

ముదిగొండ: సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలని ఏపీడీ శ్రీదేవి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఏపీఓ రంగనాయకమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాబ్జీ ప్రసాద్


బాబ్జీ ప్రసాద్

వేంసూరు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాబ్జీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తాననన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఏ రాజు బదిలీపై ఖమ్మం వెళ్లారు. దీంతో బాబ్జీ ప్రసాద్‌ను తహసీల్ సిబ్బంది అభినందించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరణ


శ్రీనివాసరావు

చింతకాని: చింతకాని ఎంపీడీఓగా చుంచు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న రామయ్య డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేయటంతో బోనకల్ ఎంపీడీఓ రమాదేవికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలను అప్పగించారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా.. ఈజీఎస్ క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న చుంచు శ్రీనివాసరావును ఎంపీడీఓగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రీనివాసరావును మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందించారు.

వేంసూరు ఎంపీడీఓగా రాజారాం..


రాజారాం

వేంసూరు: వేంసూరు మండల ఎంపీడీఓగా పరిమి రాజారాం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇదివరకు ఖమ్మంరూరల్ ఎంపీడీఓగా పనిచేసి ఆయన బదిలీపై ఎంపీడీఓగా వేంసూరు వచ్చారు.

'ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్'కు విద్యార్థినులు ఎంపిక

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మ పేర్కొన్నారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు నెలకు రూ.12 వేలు చొప్పున స్కాలర్ షిప్ వస్తుందన్నారు.

బాణసంచా షాపు ప్రారంభం

తల్లాడ: మండలంలోని అంబేడ్కర్‌నగర్ గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణి బాణసంచా విక్రయ శాలను సోమవారం వైరా ఫైర్ స్టేషన్ అధికారి అమరనేని శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సాయిమనికంఠ కల్యాణి, నరసింహరావు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

వేంసూరు: మండలంలోని కల్లూరుగూడెం సర్వే నంబర్ 514, 515, 516, 526 లో గల 45 ఎకరాల గ్రామ సామూహిక పట్టా భూమిలోకి వెళ్లేందుకు, కల్లూరుగూడెం, అమ్మపాలెం రెవెన్యూ సరిహద్దు గల దారిని కొంతమంది ఆక్రమించుకొని తమ భూమిలో కలుపుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కల్లూరుగూడెం గ్రామస్తులు సోమవారం తహసీల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. భూమి ఆక్రమణపై గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామ సామూహిక పట్టా భూమిలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తు గ్రామస్తులు హైకోర్టులో డబ్ల్యూపీ30265/2022 దావా వేశామన్నారు. ఆక్రమణ భూమిని సర్వే చేసి రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

'పది'పై ప్రత్యేక దృష్టి

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం పంపిణీ


కొణిజర్ల పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

కొణిజర్ల: పదో తరగతి విద్యార్థులను వచ్చే మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతి రోజూ పాఠశాల సమయానికి ముందు, తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు రెండు సబ్జెక్ట్‌ల చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువుల్లో వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని పరీక్షల్లో ఉత్తీర్ణులను చేసేందుకు కృషి చేస్తున్నారు. అయితే ఉదయం 8 గంటలకు పాఠశాలలకు వస్తున్న బాల బాలికలకు ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేయడంతో సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగుతుల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు.

మండలంలో పది పాఠశాలలు..

కొణిజర్ల మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాల, రెండు ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో తరగతులతో పాటు ప్రతి రోజూ వారికి పరీక్షలకు సంబంధించిన విషయాల పై తర్ఫీదు ఇస్తున్నారు. సుమారు 582 మంది బాల బాలికలు ఆయా పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ఇంటర్నల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్ట్ చొప్పున పరీక్ష నిర్వహించి పరీక్ష పేపర్లు దిద్ది తప్పులు సరి చేసి తిరిగి వారిని సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా చదువుల్లో వెనకబడ్డ బాల బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నారు. తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని చెబుతున్నారు. రాని విద్యార్థుల గురించి తల్లి దండ్రులకు సమాచారం అందిస్తున్నారు.

మంచి మార్కులు సాధిస్తా..



ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. దీని వల్ల పబ్లిక్ పరీక్షలంటే భయం పోయింది. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం ఉంది.

– టి.శివ శాంభవి, విద్యార్థిని, కొణిజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం..



ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకై విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సాయంత్రం పూట అల్పాహారం అందివ్వడానికి కూడా ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేసింది. ఈ ఏడాది గ్రేడింగ్ విధానం లేక పోవడంతో మార్కుల సాధనపై దృష్టి పెట్టాలని సూచించాం.

– డి.అబ్రహం, ఎంఈఓ, కొణిజర్ల

పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి

బోనకల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మధిర సీనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి సూచించారు. సోమవారం బోనకల్లులోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. బాలికలకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఎదగాలన్నారు. కష్టపడి కాకుండా సబ్జెక్ట్‌ను ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం వంట గది డైనింగ్ హాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ సభ్యులు కోట వెంకన్న, కన్నెపోగు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పద్మావతి, కోర్టు సిబ్బంది వెంకన్న, మల్లేశం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి


ఎర్రుపాలెం: చిన్నారులకు యూనిఫాం అందిస్తున్న ఆర్‌జేడీ జాన్సీలక్ష్మీబాయి

మధిర/ఎర్రుపాలెం/బోనకల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జాన్సీలక్ష్మీబాయి అన్నారు. సోమవారం మధిర మండలంలోని ఖమ్మంపాడు దెందులూరు, ఎర్రుపాలెం మండలంలోని కొత్తపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం అందించిన యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ బాలత్రిపుర సుందరీ మాట్లాడుతూ.. శిథిలమైన కేంద్రాల్లోని చిన్నారులను సమీప పాఠశాలల్లోకి మార్చామన్నారు. అదే విధంగా బోనకల్‌లోని రావినూతల–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్‌జేడీ సందర్శించారు. టీచర్ సెలవులో ఉండడంతో ఆయాను వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఏసీడీపీఓ కృష్ణశ్రీ, సూపర్‌వైజర్లు సునీత, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోండి..


మాట్లాడుతున్న డాక్టర్ పేరి అరుణ

సత్తుపల్లిటౌన్: భారతదేశమేకాకుండా ప్రపంచమంతా లలిత పరివారం మార్మోగుతుందని.. ప్రజలంతా భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని శ్రీలలితా పరివార్ వ్యవస్థాపకురాలు డాక్టర్ పేరి అరుణ అన్నారు. సత్తుపల్లి శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో సోమవారం ఆమె ఆధ్వర్యాన శ్రీలలితా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా, భక్తిభావంతో ఆధ్యాత్మికంవైపు పయనించాలన్నారు. అప్పుడే జీవితం ఆనందమయం అవుతుందన్నారు. లలిత సహస్రం అమ్మవారి అనుగ్రహం ఉంటేనే పఠించగలుగుతామన్నారు. అనంతరం డాక్టర్ పేరి అరుణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కొడిమెల అప్పారావు, ఎస్‌ఎల్ నర్సింహారావు, మహంకాళి శర్మ, రామప్ప, జి.నాగభూషణం, కృష్ణమోహన్, తోట సుజలరాణి, భక్తులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు..


మాట్లాడుతున్న మోటివేటర్ నవాబ్ పాషా

తల్లాడ: పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకుడు, రిటైర్డ్ ఎంపీడీఓ ఎండి.నవాబ్ పాషా అన్నారు. సోమవారం తల్లాడ రైతు వేదికలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, మానసికంగా ఉల్లాసంగా ఉంటూనే పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఎలాంటి ఆత్మ న్యూనత భావాన్ని ప్రదర్శించ వద్దన్నారు. ఈ తరగతుల్లో వీడీఎస్ ప్రసాద్, ఎంఈఓ ఎన్.దామోదర ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయుని విజయలక్ష్మీ, ఎండి.ఆశ, నోడల్ అధికారి పి.నరసింహారావు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి..


అవగాహన కల్పిస్తున్న వెంకన్న

కారేపల్లి: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏటీడీఓ ఎస్‌కే జహీరుద్దీన్ అన్నారు. రేలకాయలపల్లి, మూలపోచారం, తిమ్మరావుపేట బాలురల ఆశ్రమ పాఠశాలల్లో పది చదువుతున్న విద్యార్థులకు సోమవారం మండలంలోని ఉసిరికాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై మోటివేషన్ సదస్సును నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేటర్, ఎయిర్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న, ఆశ్రమ పాఠశాల పూర్వ విద్యార్థి గంగావత్ వెంకన్న కెరీర్ గైడెన్స్‌పై మాట్లాడి విద్యార్థులను ఆలోచింపజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగరాజు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బాచ్‌సింగ్, గోపి, సక్రాం, రవి, రాములు, సోమ్లా, వీరన్న, శివ, కిషోర్, తిరుమల, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

నిరుపేద విద్యార్థినికి రూ.10వేలు..


బాలికకు నగదు అందిస్తున్న వెలమ సంఘం బాధ్యులు

సత్తుపల్లి: కుక్కునూరు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని శెట్టిపల్లి హాసినికి సత్తుపల్లి పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం బాధ్యులు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె కుక్కునూరులో 7వ తరగతి చదువుతుంది. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి తాతయ్య, నాయనమ్మల దగ్గర ఉంటూ చదువుకుంటుంది. సోమవారం సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి వెలమ సంఘం బాధ్యులు నగదు అందించడంతో పాటు ప్రతీ ఏట పదివేల రూపాలయలు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కోటగిరి ఆనంద గజపతిరావు, రమేష్, ప్రసాద్, రాఘవయ్య, సీతారామారావు పాల్గొన్నారు.

రూ.10వేలు నగదు అందజేత..


తాహీర్‌కు నగదు అందిస్తున్న ముస్లిం ఐక్య సంఘం సభ్యులు

ముదిగొండ: మండలంలోని కమలాపురానికి చెందిన షేక్ తాహీర్ కుమార్తె వివాహానికి ముస్లిం ఐక్య సంఘం మధిర సెంట్రల్ కమిటీ సభ్యులు రూ.10వేలు నగదు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ముదిగొండ మండల ముస్లిం ఐక్య సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్, మధిర సెంట్రల్ కమిటీ సలహాదారుడు ఎండీ అజ్గర్, మండల ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి తాజుద్దీన్‌బాబా, సభ్యులు సత్తార్‌మియా, నాగుమీరా, ఇన్నూస్‌మియా, ఉస్మాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు..


విద్యార్థినికి నోట్ పుస్తకాలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్ తదితరులు

తల్లాడ: మండలంలోని నూతనకల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు మార్చిలో జరిగే పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాన్నారు. కార్యక్రమంలో తల్లాడ కాంగ్రెస్ నాయకులు దీవెల కృష్ణయ్య, అడపా అనీల్, దగ్గుల రఘుపతిరెడ్డి, తుమ్మలపల్లి రమేష్; తూము నరసింహారావు, కాపా సుదాకర్, రాయల రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ..


దుస్తులు అందిస్తున్న ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు

వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలోని జీఎస్‌ఎస్ డే కేర్ సెంటర్‌లోని సుమారు 85మంది నిరుపేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ మోదుగు వినోద్‌కుమార్, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణరెడ్డి, సతీష్, డేకేర్ సిబ్బంది నవీన్, రాజేష్, మహబూబ్‌బీ, మణి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ రఘు

వైరా: వరంగల్ జిల్లా నర్సంపేటలో ఈ నెల 9న జరిగిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో వైరా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డు, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ రఘు సోమవారం తెలిపారు. దీంతో విద్యార్థులను అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మన్విత్‌కు గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్‌తో మన్విత్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో 6వ తరగతి విద్యార్థి బొర్రా మన్విత్ కటా విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లైన్ బుడోఖాన్ కరాటే హెల్త్‌క్లబ్ నిర్వాహకులు పిచ్చయ్య, పాఠశాల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినులు..


పెనుబల్లి: విద్యార్థినులతో హెచ్‌ఎం వెంకటరమణ, కరాటే మాస్టర్ పంతంగి చందు

పెనుబల్లి/ఏన్కూరు: వీయంబంజర్ సప్తపది ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో ఉప్పలచెలక కేజీబీవీ విద్యార్థినులలో 20మందికి గోల్డ్ మెడల్, ఐదుగురికి వెండి, ముగ్గురికి కాంస్య పతకాలను సాధించినట్లు కరాటే మాస్టర్ చందు తెలిపారు. దీంతో మాస్టర్‌ను, విద్యార్థినులను హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రమ్యకృష్ణ ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం కూరకుల సైదయ్య తెలిపారు.


ఏన్కూరు: రమ్యకృష్ణను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముష్టికుంట్ల వాసికి పురస్కారం


రవికి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన కొమ్ము రవి రాసిన 'స్వార్థపు బుద్ధి'కవితకు పురస్కారం లభించింది. సాహితీసంస్థ అక్షరతోవ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో పురస్కారానికి ఎంపికైన ఆయనను ఖమ్మంలో సన్మానించారు. అక్షరతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాజమల్లు, ఉపేందర్, రవి పాల్గొన్నారు.

వారబందీతో.. ఇబ్బంది

వైరారూరల్: వారబందీ విధానంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండలంలోని గొల్లెనపాడులో ఆదివారం రాత్రి నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ వల్లాపురం, అష్టగుర్తి మేజర్, మైనర్ల పరిధిలో చివరి భూములకు సాగునీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వారబందీని సడలించి చివరి భూములకు సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం వైరా మండల కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు రాజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్

వైరారూరల్: మండలంలోని స్టేజీపినపాక కూడలి వద్ద సోమవారం పోలీస్ కానిస్టేబుల్స్ చిరంజీవి, పాషా, వివేక్‌లతో ట్రైనీ ఎస్సై పవన్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టుబడిన మందుబాబులు జరిమానా విధించారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

కొణిజర్ల/వైరారూరల్: కొణిజర్లలోని చిన్నగోపతికి చెందిన ఆంబోతు అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా.. గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహించి స్థానిక చెరువు శిఖంలో అంత్యక్రియలు నిర్వహించారు. అదే విధంగా వైరారూరల్ మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో మృతి చెందిన ఆంబోతుకు గ్రామస్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించారు.

నిధులు కేటాయించాలి

సత్తుపల్లిటౌన్: బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియాంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్ కోరారు. సోమవారం సత్తుపల్లిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు గాంధీ, ప్రభాస్, దిలీప్, పాషా పాల్గొన్నారు.

ముదిగొండలో సీపీఎం నిరసన

ముదిగొండ: ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్ బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ ముదిగొండలో సీపీఎం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. నాయకులు .. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు ఉపేందర్, అరుణ, ప్రభావతి, వెంకన్న, భద్రయ్య, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత మండలంగా తీర్చి దిద్దడమే లక్ష్యం

తల్లాడ: మండలంలోని అన్ని గ్రామాలను టీబీ రహితంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కమ్యూనిటీ హెల్త్ అధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ నగర్ గ్రామాన్ని త్వరలోనే టీబీ ఫ్రీ పంచాయతీగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్ పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మృతి..

బోనకల్: మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ప్రముఖ న్యాయవాది ఏడునూతల సీతమ్మ(93)అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు సందర్శించి నివాళులు అర్పించారు.

ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలి


సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

మధిర: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు అరుణకుమారి, రామచంద్రరావు, రామారావు తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ మధిర డిపో జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ షేక్ నాగుల్ మీరా అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. జనవరి 27న రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. సమ్మె నోటీస్‌పై ప్రభుత్వం, యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 2021 వేతన సవరణ వెంటనే అమలు చేసి వాటి ఏరియర్స్‌తో పాటు 2017 వేతన సవరణకు సంబంధించిన అలవెన్స్‌లను పెంచి ఏరియర్స్ చెల్లించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు ఇవ్వాలన్నారు. విశ్రాంత కార్మికులకు ఇవ్వవలసిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, అన్ని కేటగిరీల ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల డిమాండ్లతో సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందని, జేఏసీ పిలుపుమేరకు సమ్మె చేయడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కిషోర్ బాబు, మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.